www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 1 మార్చి 2023
5
వైఎస్ఆర్

చెక్కులను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి

రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతు భరోసా, తుఫానులో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని విసి హాల్ లో రైతులకు చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కింద జిల్లాలో 2,02,598 మంది రైతులకు గాను రూ.42.73 కోట్లు, తుఫాన్‌లో నష్టపోయిన 838 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 74.75 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్. కవిత

మార్పుతోనే రోడ్డు ప్రమాదాల నివారణ : జడ్జి

ప్రజాశక్తి - కడప

ప్రజలలో మార్పుతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. మంగళవారం రీజనల్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ మొదలగు పత్రాలు జారీ చేయు విషయంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆర్‌టిఒ, ట్రాఫిక్ పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు వాటిల్లుతూనే ఉన్నాయని తెలిపారు. 18 ఏళ్ల దాటిన పిల్లలకు వాహనాలు ఇవ్వడం పెద్దవాళ్ల తప్పే అవుతుందని, అలా చేయరాదని చెప్పారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత తగ్గించవచ్చునని అన్నారు. పరిమిత వేగంతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన పత్రాలతో వాహనాలు నడపడం వల్ల అనేక సమస్యలు నివారించవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా రోడ్ ట్రాన్స్‌పోర్టు, పోలీసు అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివ ప్రసాద్, విజయభాస్కర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎన్జీవోలు, ఆటో డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

జగన్ పాలనతో రాష్ట్రం ఆర్థిక దివాలా

కడప అర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన రాహిత్యంతో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మంగళవారం గాయత్రీ టవర్స్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా డబ్బులు ఖజానాకు చేరక జగన్ ఖజానాలో జమ అవుతుందని చెప్పారు. ఇసుక ప్రయివేట్ పరం, లిక్కర్, ఆఖరుకు మైన్స్‌ను ప్రవేటు పరం చేసినట్లు జీవో కూడా ఇచ్చారన్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూర్చే ఆర్థిక వనరులను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టి వచ్చిన డబ్బుతో రానున్న ఎన్నికల్లో జగన్ ప్రజలను ప్రలోభాలు చేయ ఉన్నారని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు నేరుగా వసూలు చేసుకునే పరిస్థితి వచ్చారని, రూ. 65 ఉన్న రాయల్టీని రూ. 95 కి పెంచి ప్రయివేట్ వ్యక్తుల నుంచి రాబట్టుకుంటున్నారని విమర్శించారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కరి కి కట్టబెట్టి జగన్ సొంత ఖజానా నింపుకొంటున్నారని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ లో వైసిపి కార్పొరేటర్లు ప్రభుత్వంపై తిరగబడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పనవసరం లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమైతే నాకేంటి అన్న ధోరణితో తిరిగి అధికారంలోకి రావాలనేది జగన్ లక్ష్యమని మండిపడ్డారు.

కార్యకర్తల్లో నూతన ఉత్సాహం

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు

చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించి కాంగ్రెస్ జాతీయ మహా సభలు కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయపూర్ ప్లీనరీలో అనేక విషయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నామన్నారు. 2024లో గెలుపే ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందన్నారు. బావ సారూప్య పార్టీలతో కలిసి పనిచేస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నియంత్రించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ ప్రజల హృదయాలకు చేరువ అయ్యారని తెలిపారు. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి సూర్యుడు, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గేని కలిసిన విజయ సుశీల్ కుమార్

కడప : యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమండలం విజయ సుశీల్ కుమార్ మంగళవారం జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గేని కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబుకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యున్నతి కోసం అందరు కృషి చేయాలని మల్లికార్జున కార్గే సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రాధాన్యతా రంగాలను పటిష్టం చేయాలి

కడప : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలులో కలెక్టర్ అధ్యక్షతన అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన పలురకాల లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై సంబంధితాధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో విస్తృత సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను అందుకునేలా సాగుబడి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ప్రతి రైతు కూడా సాగుచేసే పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్‌బికెల ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎపిఎంఐపి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సన్న చిన్నకారు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖలో వైద్యులు మరింత విస్తృతం చేస్తూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు సీజన్ల వారీగా అవసరమైన అన్ని రకాల ఎరువులను, పెస్టిసైడ్స్‌ను అన్ని ఆర్‌బికెల పరిధిలో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖ జెడిలు నాగేశ్వరరావు, శారదమ్మ, హార్టికల్చర్ డీడీ మైకేల్ రాజీవ్, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఫిషరీస్, సెరికల్చర్ డీడీలు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

కడప అర్బన్ : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతూ ఉన్నాయి. మంగళవారం 6,768 విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సి ఉండగా 6,560 మంది హాజరయ్యారు. 208 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకులు రమణ గుప్తా, డివిఇఒ శ్రీనివాసులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

వాహనాల తనిఖీ : జరిమానా విధింపు

కడప : నగరంలో మంగళవారం ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తున్నటువంటి ద్విచక్ర, నంబర్ ప్లేట్లు సరిగా లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీ నిర్వహించి 75 కేసులు నమోదు చేశామని ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. ఆరు వాహనాలను సీజ్ చేశామన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే వారి కుటుంబ సభ్యులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న స్కూల్ బస్సులపైనా దాడులు నిర్వహించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి వై. ప్రసాద్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో వైద్య సదుపాయాల

పటిష్టతకు రూపకల్పన

హెచ్‌డిఎస్ సమావేశంలో కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌డిఎస్ చైర్మన్, కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. మంగళవారం రిమ్స్ ప్రభుత్వ వైద్యకళాశాల బోర్డు మీటింగ్ హాలులో 50వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కేవలం జిల్లా ప్రజలకు మాత్రమేగాక రాయలసీమ స్థాయిలోనూ ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో మెరుగైన వైద్య సేవలతో వేలాది మంది ప్రజల నిత్యం ప్రాణ రక్షణ కల్పిస్తున్న జిజిహెచ్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్ డిఎస్ సభ్యులకు సూచించారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, అందులో భాగంగానే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రాయలసీమలోనే అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా వైఎస్ఆర్ జిల్లా జిజిహెచ్ విస్తృత సేవలు అందించనుందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా జిజిహెచ్ అభివృద్ధి సొసైటీ ముందుకెళుతోందన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యాధిపతులతో ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకుని సంబంధిత వార్డుల్లో కొరత లేకుండా అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జిజిహెచ్‌లో ఉన్న అత్యంత విలువైన, అధునాతన వైద్యపరికారాలను నిర్లక్ష్యంగా ఉపయోగిస్తే సహించేదిలేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలని సొసైటీ సభ్యులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సల సంఖ్యను పెంచాలన్నారు. రక్తనిధి కేంద్రంలో అన్ని రకాల రోగులకు అత్యవసరమైన అన్ని గ్రూపుల రక్తాన్ని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిహెచ్‌ఎం కళాశాల విద్యార్థుల కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ స్టేడియంను కూడా ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని. అందుకు అవసరమైన స్థలాన్ని కూడా చూడాలన్నారు. అనంతరం జిజిహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యాధిపతులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఆయా విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధిలో పారిశ్రామిక, వాణిజ్య వేత్తలను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్, మీనా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ .వై. శ్రీనివాసులు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఇఇ ఎ. బి. సురేంద్రనాథ్ రెడ్డి, డిఎంహెచ్ఒ కె.నాగరాజు, ఏపీ వివిపి డిసిహెచ్ఎస్ డాక్టర్ వై. హిమ దేవి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురిలత, తదితర హెచ్‌డిఎస్ సభ్యులు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శ్రీధర్, శ్వేతా, అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

పుష్ప'గిరి' ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి

- నేడు గిరి ప్రదక్షిణకు పీఠాధిపతి ముహూర్తం
- 60 ఏళ్ల తరువాత గిరి ప్రదక్షిణ పునఃప్రారంభం

ప్రజాశక్తి-వల్లూరు

ధార్మిక సంస్థలు, ప్రముఖుల సహకారంతో ఏర్పాట్లు పుష్పగిరిలో గిరి ప్రదక్షణకోసం యేర్పాట్లు ముమ్మరం చేశారు. పనులు సంతృప్తిగా సాగుతున్నాయి. తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు విశేష ప్రాచుర్యం ఉంది. సరిగ్గా అలాంటి కార్యక్రమమే పుష్పగిరిలో నిర్వహించాలని జిల్లాకు చెందిన కొందరు ధార్మికసంస్థల ప్రతినిధులు రెండు మాసాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మార్చి 1న ఈ కార్యక్రమం నిర్వహించాలని పుష్పగిరి ప్రస్తుత పీఠాధిపతి ముహూర్తం కూడా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి తక్కువ సమయంలో ఏర్పాట్లు చేయవలసి ఉండడంతో నిర్వాహకులు కొండచుట్టూ దారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గిరిప్రదక్షిణ అనగానే మనకు సాధారణంగా అరుణాచలం గుర్తుకువస్తుంది. కడప జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతమైన పుష్పగిరి కొండచుట్టూ సుమారు 60 సంవత్సరాల క్రితం గిరి ప్రదక్షిణ జరిగేదని, దాన్ని పునరుద్ధరించడం ఈ క్షేత్రానికే కాకుండా జిల్లాకు అన్నివిధాలా శ్రేయస్కరమని పలువురు ధార్మిక వేత్తలు బావిస్తున్నారు. కడప నగరానికి చెందిన న్యాయవాది, రాష్ట్ర దేవాలయాల పరిరక్షణసమితి సట్టి భారవి ఈవిషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పలువురు పండితులను కలిసి గిరిప్రదక్షిణ విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. విషయాన్ని సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. జిల్లాకు మంచి జరిగితే తమకూ ఇష్టమేనని, ఈ విషయంపై పూర్తిగా సహకరిస్తామని పెద్దలు హామీ ఇవ్వడంతో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లా దేవదాయశాఖ అధికారులను ఆర్థిక సాయం కోరారు. పుష్పగిరి ప్రస్తుత పీఠాధిపతిని కలిసి ఈ విషయంపై చర్చించారు. మార్చి 1న పుష్పగిరిలో గిరి ప్రదక్షిణకు ముహూర్తం నిర్ణయించారు.

కొండచుట్టూ రోడ్డు : కొండ చుట్టూ జరుగుతున్న రోడ్డు నిర్మాణపనులు పూర్తి కావచ్చాయి. ప్రస్తుతం పుష్పగిరిలో నదిఒడ్డున కొండపై దేవాలయాలు ఉన్న కొండచుట్టూ గిరి ప్రదక్షనలు చేయాలని నిర్ణయించినా సరైన దారిలేకపోవడంతో తొలుత రోడ్డు నిర్మాణంపై దృష్టి సాధించారు. కొండచుట్టూ దాదాపు 12 కిలో మీటర్లు నడవాల్సి ఉండగా సగానికి పైగా మార్గంలో రాళ్లు, ముళ్ల పొదలు ఉండడంతో వాటిని శుభ్రంచేసి తాత్కాలికంగా రోడ్డు వేసేందుకు వివిధ యంత్రాలతో పనులు చేపట్టారు. జిల్లా నలుమూలల గ్రామాల్లో ప్రచారం చేసి ప్రదక్షిణ నాటికి పెద్ద ఎత్తున జనసమీకరణ చేసేందుకు కూడా స్థానిక పెద్దల సహకారంతో ప్రయత్నాలు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. మంగళవారం నెహ్రూ పార్కు సచివాలయం ఎదుట సిఐటియు నాయకత్వంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మహిళలకు నాలుగు సార్లు మస్టర్ విధానం పెట్టారని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారిలో నెలసరి సమస్యలు, ఆపరేషన్ అయినా వారు, వయస్సు దాటినా వారు ఉన్నారని చెప్పారు. ఇప్పుడు కొత్తగా ఫేస్ మస్టర్ విధానం అమలుకు గతంలో అధికారులు స్టిక్కర్లు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయా లని ఎంహెచ్ఒ మెసేజ్‌లు పంపారన్నారు. పారిశుధ్య కార్మికులు ఎక్కువ మంది చదువు రాని వారు, కనీసం కీ ప్యాడ్ ఫోన్లు వాడడం రాని వారు కూడా ఉన్నారన్నారు. పైగా అందరికీ ఆండ్రాయిడ్ ఫోన్లు లేవని, ఫేస్ మస్టర్ ఎలా వేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెనుకకు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎటువంటి ఆందోళన కార్యక్రమాలకు ఎప్పుడు పిలుపునిచ్చిన మనమందరం సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఫేస్ మస్టర్ విషయంలో ఎవ్వరూ తొందర పడద్దని తెలిపారు. కార్యక్రమంలో ఇత్తడి ప్రకాష్, లక్ష్మి, నాగిపోగు వెంకటస్వామి మున్నంగి కిషోర్ ప్రభావతమ్మ పాల్గొన్నారు.

యోగిపుంగవుడు 'జానమద్ది'

కడప అర్బన్ : తెలుగు భాషా సాహిత్యాల కోసం జీవితాన్ని అంకితం చేసిన సి.పి.బ్రౌన్ జ్ఞాపకార్థం విజ్ఞాన కేంద్రమైన బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించడం కోసం అహరహం తపించిన యోగిపుంగవుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. మంగళవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో డాక్టర్ హనుమచ్ఛాస్త్రి నవమ వర్ధంతిని, స్మారకోపన్యాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రితో తనకు చాలా అనుబంధం ఉందని, తాను 1978లో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు చదువుతున్నప్పుడు అక్కడ లెక్చరర్ల రెఫ్రెషర్ కోర్సు జరిగిన సందర్భంలో తాను అవధానం చేశానని, అప్పుడు మొట్టమొదట జానమద్దివారితో పరిచయం ఏర్పడిందన్నారు. సభాధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గొప్ప దార్శనికుడని తెలిపారు. విశిష్ట అతిథి, శ్రీఅచలానంద ఆశ్రమం (బ్రహ్మంగారి మఠం) పీఠాధిపతులు స్వామి విరజానంద మాట్లాడుతూ జానమద్ది వారు తన గురువైన అచలానందస్వామికి సన్నిహితులని, ఆ అనుబంధంతో ఆయన రచించిన అనేక వ్యాసాలు తమ ఆశ్రమం నిర్వహించే 'కాలజ్ఞానసుధ' పత్రికలో వచ్చాయన్నారు. వేదికపై నున్న అతిథులను, జానమద్ది ఆత్మీయులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సాహితీవేత్త ఎస్.ఈశ్వరరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, బాలవికాస్ పాఠశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి కడప అర్బన్

జెవివి ఆవిర్భావ దినోత్సవంలో విద్యార్థులు

జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు జనవిజ్ఞాన వేదిక జెండా ను ఆవిష్కరించారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక 1988, ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజున శాస్త్ర విజ్ఞాన ప్రచారసంస్థగా ఆవిర్భావించిందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. 'ప్రజల కోసం సైన్స్..ప్రగతి కోసం సైన్స్.. "దేశ స్వావలంబన కోసం సైన్స్' అనే లక్ష్యాల కోసం పనిచేస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రంగాల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు విద్య, వైద్య, సాంస్కృతిక, సాహిత్యం, కళలు, స్వావలంబన, దేశభక్తి, నిరక్షరాస్యత నిర్మూలన, మూఢనమ్మకాల నిర్మూలన, మద్యపాన నిషేధం వంటి అనేక అంశాలపై కార్యక్రమాలు రూపొందించుకుని పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ విధంగా చేస్తున్న 2005లో భారత ప్రభుత్వం విశిష్ట సైన్స్ సేవలందించిన సంస్థగా జన విజ్ఞాన వేదికకు అవార్డు ఇచ్చారని తెలిపారు.. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సరస్వతి, జిల్లా కమిటీ రామాంజనేయరెడ్డి, నగర అధ్యక్షులు అబ్బాస్ వల్లి, ఉపాధ్యక్షులు రాయల్ కరిముల్లా, కామేశ్వరమ్మ, జగదీష్, మధుసూదన్, ప్రకాష్, సువర్ణలత, శ్రీనివాసరాజు, చంద్రకళ, సత్యనారాయణ, గోవిందు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎమ్మార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు మెస్ బిల్ అధికంగా వేస్తూ నాసిరకం ఆహారం పెడుతున్నాని పేర్కొన్నారు. బాలికల హాస్టల్‌లోని పెన్నా బ్లాక్‌లో తాగునీరు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సీనియర్, జూనియర్ హాస్టల్ మెస్‌ను వేరు చేయాలన్నారు. నూతన కోర్సులు పెట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రిన్సిపల్ సానుకూలంగా స్పందించారు. పరిష్కరించిని పక్షంలో ఉద్యమని చేపడతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు.

3న బాలవికాస్ స్కూల్ రజతోత్సవ వేడుకలు

కడప : ఎర్రముక్కపల్లిలోని బాల వికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ రజితోత్సవ వేడుకలను మార్చి నెల 3వ తేదీన సాయంత్రం 5.00 గంటలకు బాలవికాస్ ప్లే గ్రౌండ్ లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ బి. గంగయ్య, స్కూల్ ఫౌండర్ సుబ్బరాయుడు తెలిపారు. రజతోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కే. సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, జడ్‌పిటిసి రామాంజులరెడ్డి, డిఎస్‌పి వెంకటశివారెడ్డి, డిప్యూటీ డిఇఒ రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓ నారాయణ, రామకృష్ణ మిషన్ స్వామి మహారాజ్, 21 డివిజన్ కార్పొరేటర్ సుజాత, డివిజన్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు.

విద్యా రంగంలో వింత నిర్ణయాలు తగవు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా రంగంలో వింత నిర్ణయాలు తగవని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం యుటిఎఫ్ భవనంలో ప్రాంతీయ మండలాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనను మదింపు చేయడానికి విద్యారంగంలో అనుభవం కలిగిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కానీ, మండల విద్యా శాఖ అధికారులు కానీ, ఉప విద్యాశాఖ అధికారి కానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కానీ పర్యవేక్షించాలే తప్ప ఎటువంటి అనుభవం లేని వారి చేత పర్యవేక్షించాలని అనుకోవడం దారుణమని వాపోయారు. ఇప్పటికే పెండ్లిమర్రి, వేముల మండలాల్లో సిఆర్‌పిల పర్యవేక్షణ నిర్వహించాలని అధికారుల ఆదేశాలతో ఉపాధ్యాయుల బోధన మదింపు చేయడం ప్రారంభమైందని పేర్కొన్నారు. సిఆర్‌పిలను ఉపాధ్యాయులపై పర్యవేక్షకులుగా నియమించడాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా కోశాధికారి దావుద్దీన్, కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు శ్యాంసుందర్, శివశంకర్, సూర్య కుమార్, శ్రీకాంత్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

11న బ్యాలెట్ పేపర్లు పంపిణీ

కడప : కడప- అనంతపురం- కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీ మార్చి 11న చేపడతామని అనంతపురం జిల్లా రిటర్నింగ్ అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పుట్టపర్తి, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన డిఆర్ఒలు, నోడల్ అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు ఈ సందర్భగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ అనంతపురంతోపాటు కడప, అన్నమయ్య, పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేస్తామన్నారు. వాటిని ఆయా జిల్లాల నుంచి పోలింగ్ కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో కడప కలెక్టరేట్ నుంచి డిఆర్ఒ గంగాధర్ గౌడ్, బద్వేలు ఆర్‌డిఒ వెంకట రమణ, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పిడీలు ఆనంద్ నాయక్, యాదుభూషన్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి, స్పెషల్ కలెక్టర్ రామ్ మోహన్, మురళి, సమాచార శాఖ ఎడి వేణుగోపాల్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి శివా రెడ్డి వివిధ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పట్టా భూములు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని ఆకుల నారాయణపల్లె గ్రామంలోని పేదలు అక్కింగుండ్ల, కత్తెరగుండ్ల రెవెన్యూ పొలాల్లో సాగు చేసుకుంటున్న భూములను అసైన్‌మెంట్ కమిటీలో చేర్చి పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య పేర్కొన్నారు. మంగళవారం వారు తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనేళ్ల నుంచి పేదలు సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. మండలంలో చాలా భూమి ఆక్రమణకు గురైందని, ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి బడా నాయకుల నుంచి కబ్జా భూములను లాక్కొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణపల్లె గ్రామ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. **పోతుల నాగరాజుకు ఓటేయ్యాలి**..పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజుకు ఓటు వేసి వేయించి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, కమిటీ సభ్యులు పోలయ్య కోరారు. మండల కేంద్రంలోని నరసాపురంలో పోస్టరు విడుదల చేశారు. అనంతరం జడ్‌పి, మోడల్ పాఠశాలు, తహశీల్దార్ కార్యాలయాల్లో కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులందరూ పోతుల నాగరాజుకు ఓటు వేస్తే సమాజానికి, మనకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

కదిరి సిఐని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న మన్నూర్ అక్బర్

పోలీసు ప్రతిష్టను దిగజా రుస్తున్న కదిరి సిఐ మధును సస్పెండ్ చేయాలని, జాతీయ మహిళా మైనార్టీ కమిషన్ స్పందించి మహిళలకు న్యాయం చేయాలని, మీడియా వారిపై అన్యాయంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ కోరారు. మంగళవారం పాత బస్టాండ్‌లోని అక్బర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరిలో చిరువ్యాపారులకు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు అడిగినందుకు సిఐ దుర్భాషలాడి మహిళలపై దాడి చేశారన్నారు. మీడియా వారిపైన నాన్ బేయిలబుల్ కేసులు నమోదు చేయడం శోచనీయమన్నారు. సమావేశంలో జిల్లా మైనారిటీ నాయకులు అబ్దుల్ సలాం, రూపన గుడి హుస్సేన్, జిల్లా మైనారిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మంజూరు అహమ్మద్, జిల్లా బిసి సెల్ సెక్రటరీ నాదిండ్ల దస్తగిరి, నాయకులు పాల్గొన్నారు.

కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

కడప అర్బన్ : శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో నలుగురు రిపోర్టర్లపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనువాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కదిరి పట్టణంలో రెండు రోజుల కిందట నిర్వహించిన హింసాత్మక ఘటనలు, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలను కవర్ చేస్తున్న విలేకర్లపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళ కౌన్సిలర్‌పై సిఐ తమ్మిశెట్టి మధు వ్యాఖ్యలకు నిరసన తెలపడానికి వెళ్లిన మహిళలపై లాఠీఛార్జి ఘటనను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై దుర్భాషలాడుతూ దాడి చేయడమే కాకుండా పోలీస్ కేసులను నమోదు చేయడం దుర్మార్గమని తెలిపారు.

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

వల్లూరు : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి ఎక్కడా కనబడట్లేదని టిడిపి మండల కన్వీనర్ లేబాక నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. టిడిపి పిలుపు మేరకు మండలంలోని అక్షింతల ఓబాయపల్లిలో నియోజకవర్గ పుత్తా నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ప్రజలతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక సామాన్యుడు బతికే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. నిత్యావసర వస్తువుల ధరలు ఎక్కడ లేని విధంగా పెరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్ఎన్ఆర్, పుత్త ఈశ్వర్ రెడ్డి, మామిళ్ళ చెన్నారెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి చెన్న కృష్ణారెడ్డి ,సుబ్బారెడ్డి, వెంకటసుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి, రామచంద్రుడు రెడ్డి, వీరారెడ్డి, వెంకటసుబ్బయ్య, దస్తగిరి, నాగ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, సర్దాం, అబ్దుల్ రసూల్, ఇంద్రసేనారెడ్డి, గోపాల్, ఓబులేష్ ,రమణారెడ్డి, మహబూబ్ తార, గౌస్ పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి

కడప అర్బన్ : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు, అదనపు అధికారి డాక్టర్ ఎస్.కె. ఖాదర్ వల్లి అన్నారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పట్టణ కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు బ్యానర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 21 వరకు కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు. వ్యాధి లక్షణాలుంటే వైద్యులకు చూపించుకుని చికిత్స పొందాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ మహేశ్వర రావు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - వేంపల్లె

అయా రంగాల్లో రాణించేందుకు విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాన్ని పెంచుకోవాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. స్థానిక పులివెందుల రోడ్డులోని కందుల ఓబుల్‌రెడ్డి ఐటిఐని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు, విద్యార్థులతో శిక్షణ కోసం ఏర్పాటు చేసిన మిషనరీలను పరిశీలించారు. విద్యార్థులతో విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక విద్యతో విద్యార్థులు ఉపాధి పొందాలని సూచించారు. విద్యార్థులతో సిల్క్ డెవలప్‌మెంట్ చేసేందుకు సాంకేతిక విద్యకు సంబంధించిన ఐటిఐలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన వివరించారు. వేంపల్లె, వేములలో ఉన్న ఐటిఐలతోపాటు పులివెందులలోని ఐటిఐలను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ వెంకటేష్, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు, రెవెన్యూ, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : స్థానిక న్యాక్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ వి.విజయరామరాజు, పాడా ఒఎస్‌డి బి.అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ట్రైనీలతో శిక్షణ జరిగే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ప్రారంభించిన సోలార్ ఇంజనీర్ శిక్షణ తరగతులు, ప్రాక్టికల్ ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పులివెందుల తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, సీడాప్ జెడియం ఎస్.వేణుమాధవ్, ఎపిఎస్ఎస్‌డిసి మేనేజర్ డి.నాగార్జున, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్, సీడాప్ సిబ్బంది కె.పృథ్వి, న్యాక్ ఇన్‌ఛార్జి చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశంలో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తాడిపత్రి రోడ్డులో ఉన్న 19, 20 గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద రంగం చేనేత అన్నారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది చేనేత కార్మికులున్నారన్నారు. చేనేతపై ఆధారపడిన ఉత్పత్తుల వారు అదనంగా మరో రెండు లక్షల మంది ఉన్నారన్నారు. ఇంత చరిత్రగల చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండు వందల కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ డబ్బు కూడా నేతన్న నేస్తం లబ్ధిదారులకు ఎనభై వేల మందికి మాత్రమే సరిపోతుందన్నారు. చేనేత పరిశ్రమలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. జిఎస్‌టి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేనేతపై వేసిన పన్ను 46 శాతం ఉందన్నారు. దీనివల్ల రంగులు, రసాయనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టు, సిల్కు ధరలు కూడా పెరిగాయన్నారు. జగనన్న ఇళ్లకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోదని, ఐదు లక్షలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి షరతులు లేకుండా నేతన్న నేస్తం ఇవ్వాలన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు దస్తగిరి, కమాల్‌బాషా, హాజీ, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **మైలవరం :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే బడ్జెట్ సమావేశంలో చేనేత రంగానికి రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మండల నాయకులు సంజీవరాయుడు, లక్ష్మీనారాయణ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వేపరాల గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం సచివాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, శంకర్, కృష్ణ, ముని, ప్రసాద్, శివశంకర్ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత నాయకులు

పుట్టా ఓబులేసు అభినందనీయులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ ఉపాధ్యాయులు, యువరచయిత పుట్టా ఓబులేసు రాసిన సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకం ప్రస్తుత ప్రపంచంలోని సమకాలీన సాంకేతిక ప్రగతికి ప్రతిబింబమని కలికిరి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రొఫెసర్ కె.అంకయ్య కుమార్ పేర్కొన్నారు. స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం రోటరీక్లబ్ అధ్యక్షులు కుండా భాస్కర్ ఆధ్వర్యంలో పుట్టా ఓబులేసు రాసిన సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకం ఆవిష్కరణగావించారు. ముఖ్యఅతిథిగా అంకయ్యకుమార్ మాట్లాడుతూ సంక్లిష్ట సాంకేతిక అంశాలను అందరికీ సులువుగా అర్థమయ్యేలా రాయడం బాగుందన్నారు. గౌరవ అతిథి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శాస్త్ర, సాంకేతిక అంశాలను పుస్తక రూపంలోకి తీసుకురావడంలో పుట్టా ఓబులేసును వెలకట్టలేమని కొనియాడారు. జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ సుబ్బానాయుడు, పుస్తక రచయిత ఓబులేసు ప్రసంగించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పార్ధసారధి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, చంద్రమౌళి, రాజు సాక్టర్, పి.గురుప్రసాద్, ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచికె బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ప్రముఖులు

దిగజారుడు రాజకీయాలు ఎవరివో ప్రజలకు తెలుసు

ప్రొద్దుటూరు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌రెడ్డి అపవాదు వేయడం తగదని, వాస్తవానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడింది ఎవరనేది ప్రజలు గమనిస్తున్నారని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చివరి క్షణంలో స్వతంత్ర అభ్యర్థిగా రమణయ్య యాదవ్ అను వ్యక్తితో నామినేషన్ వేయించారని, నామినేషన్ పత్రాల్లో ముగ్గురు టిడిపి కౌన్సిలర్లతో సంతకాలు చేయించగా వీటిలో ప్రొద్దుటూరుకు చెందిన మహిళా కౌన్సిలర్ శివజ్యోతితో సంతకం చేయించారన్నారు. అనంతరం ఆ సంతకం తనదికాదని ఫోర్జరీ అని చెప్పించినావంటే ఈ వ్యవహారంలో ప్రవీణ్‌రెడ్డికి పెద్ద మొత్తంలో డబ్బు ముట్టిందని ఆరోపించారు. లేనిపక్షంలో పార్టీ ఇన్‌ఛార్జిగా సస్పెండ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజలకు పనికొచ్చే రాజకీయాలు చేస్తే మైలేజీ వస్తుందని వంశీధర్‌రెడ్డి సూచించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు : శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని ఆరోగ్య కార్యదర్శి రెబక పేర్కొన్నారు. టిబి రోడ్డు పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధి బుడ్డాయపల్లిలోని బిసి బాలికల వసతి గృహంలో మంగళవారం సాయంత్రం ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సిర్డ్ సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చటరీత్యానేరమన్నారు. వసతిగృహ అధికారి సత్యవతి పాల్గొన్నారు.

నాటు సారా ఊట ధ్వంసం

వేంపల్లె : ముతుకూరు సమీపంలోని మొగమూరు వంకలో 200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సిఐ ఆదేశాలు మేరకు మంగళవారం పొలాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ కృష్ణచైతన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకే రైతు భరోసా కేంద్రాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి వారు నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్కు ఏర్పాటు చేశారు. రైతు ఉత్పత్తుల అమ్మకాల కోసం బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దిన డిజిటల్ కియోస్కును ఏర్పాటు చేశారు. డిజిటల్ కియోస్క్ ద్వారా రైతులు తమకు కావాల్సిన వ్యవసాయ ఉత్పాదకాలను తమ గ్రామం నుంచే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు. పంట యాజమాన్య పద్ధతులు వీడియో అందుబాటులో ఉంటాయి. బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. రైతులు తమ గ్రామానికి దూరంగా ఉన్న బ్యాంకుకు వెళ్లే పనిలేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారానే సాగుకు అవసరమైన రుణాలు పొందవచ్చు. బ్యాంకులకు సంబంధించి కరస్పాండెంట్లు ఆర్‌బికెల్లో అందుబాటులో ఉండి నగదు చెల్లింపులు చేస్తారు. ఆచరణ ఘనంగా ఉన్నా.. అమలు నిరుపయోగం మారింది. రైలకు డిజిటల్ కియోస్క్‌లు ఉపయోగపడడం లేదు. ప్రొద్దుటూరు మండలంలో 17 ఆర్‌బికెలున్నాయి. ఇందులో16కేంద్రాల్లో డిజిటల్ కియోస్కు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు ఆన్‌లైన్ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించి వ్యవసాయ సీజన్‌లో కొద్దిపాటి పెట్టుబడి రుణాలు రైతులు పొందేలా చూడాల్సి ఉంది. కరస్పాండెంట్లను నియమించి వారు ప్రతిరోజూ రెండు గంటల పాటు ఆర్‌బికెలో అందుబాటులో ఉండి రైతులకు సేవలు అందించాల్సి ఉంది. ప్రతి రైతు రూ.20 వేల వరకూ లావాదేవీలు జరుపుకోవచ్చు. బ్యాంకులు లేని అన్ని గ్రామాల్లో డిజిటల్ వినియోగంలోకి తెచ్చి బ్యాంకు కరస్పాండెంట్ల ద్వారా రైతులకు మెరుగైన బ్యాంకు సేవలు అందించాలి. గత రెండేళ్లుగా ఆర్‌బికెల ద్వారా బ్యాంకు సేవలు అని చెప్పారే తప్ప.. ఆచరణలో ఏమి జరుగలేదు. దీంతో సాగు పెట్టుబడి కోసం రైతులు ప్రయివేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. అధిక వడ్డీల కారణంగా రైతుల నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి డిజిటల్ కియోస్క్‌లను అందు బాటులోకి తెచ్చి, బ్యాంకు కరస్పాండెంట్లను నియ మించి, మెరుగైన సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.

డిజిటల్ కియోస్క్ మిషన్

ప్రతి హామీనీ నెరవేరుస్తున్నాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నా హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైయస్సార్ ఆడిటోరియంలో మంగళవారం వైసిపి నాయకులు, సచివాలయ నూతన కన్వీనర్లు, గృహ సారథులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ మాట్లాడుతూ పిల్లల చదువులపై ఎంతో ఉన్నత ఆలోచనలు చేస్తూ, వాటిని అమలు పరుస్తున్న వ్యక్తి జగనన్న అని తెలిపారు. జగనన్న చేస్తున్న అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారని తెలిపారు. నూతనంగా ఎంపికైన గృహ సారథులు, గడపగడపకూ వెళ్లి జగనన్న సేవలను వివరించాలన్నారు. జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిలను నియమిస్తున్నామని, ఇందులో మండలాలకు సంబంధించి ఒక వ్యక్తిని, మున్సిపాలిటీకి సంబంధించి ఇద్దరు వ్యక్తులను నియమిస్తామన్నారు. మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో తాను మంత్రిగా పనిచేసే సమయంలో పులివెందుల ప్రాంతంలో ఎన్ని బోర్లు వేసినా చుక్క నీరు పడేది కాదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రైతులను ఆదుకునేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టారన్నారు. వైయస్ చలువతోనే ఎక్కడ చూసినా జలకళ కనిపిస్తోందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 10టిఎంసి నుంచి 44టిఎంసిలకు పెంచిన ఘనత దివంగత వైయస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి, పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, ఎపి పౌరసభ శాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు బలరామిరెడ్డి, సింహాద్రిపురం మండల ఇన్‌ఛార్జి కోరుకుంటపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అంకాలమ్మ గుడి చైర్మన్ యార్వ వెంకటసుబ్బయ్య, గూడూరు గురుప్రసాద్, కడియాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, విజయ్‌కుమార్ నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, అరకటవేముల సుజాత చిన్నప్ప, సాయి, కో - ఆప్షన్ చంద్రమౌళి, సుంకర రవికుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రభుత్వ చర్యలు పర్యావరణానికి హాని

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం పర్యావరణానికి హాని కలిగించడం దురదృష్ట కరమని మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానికంగా పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఇంట్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేధావుల మౌనం సమాజానికి చేటు తెస్తుందన్నారు. ప్రకృతి వనరులైన గనులు, ఇసుక, మట్టిని వైసిపి ప్రభుత్వం దోచేస్తున్నట్లు ఆరోపించారు. సహజ వనరులను, పర్యావరణ పరి రక్షణను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఎక్కడికి వెళ్లినా అక్కడున్న చెట్లను నరికేయడం శోచనీయమన్నారు. శాసన సభలో స్పీకర్ మాట్లాడే భాష కూడా సరిగాలేదన్నారు. శాసన విలువ లతోపాటు శాసన వ్యవస్థ అందరికీ ఆదర్శంగా ఉండాలని ఆయన సూచిం చారు. కొడాలి, అనిల్ మరికొందరు మాట్లాడుతున్న భాష ఎలాంటిదో ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం బాధాకరమన్నారు. పరభాష పరిజ్ఞానం జాతి వినాశానికి దోహదం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి సాహిత్య అకాడమీలో సాహిత్యానికి సంబంధం లేని వ్యక్తులతో నింపడం శోచనీయమన్నారు. ప్రాథ మిక విద్యలో మాతృభాష తప్పనిసరిగా ఉండాలని జాతీయ విద్యా విధానం సూచిస్తోందన్నారు. ప్రాథమిక విద్యను తెలుగులోనే బోధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, చెన్నకేశవ, అమర్, ఉత్తన్న, శివ, వెంకటేష్, బద్రీ, రాఘవయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్

ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

ప్రజాశక్తి - చాపాడు

పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సూచించారు. దిలీప్ ఇండియన్ గ్యాస్ ఆవరణలో మంగళవారం ఆయన ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలో 1,119 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. విద్యావంతుల ఎన్నికలు కావడంతో వందశాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ ఒడ్డి, నాయకులు ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, శాంతరాజు, జయ సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, రమణయ్య, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పురపాలక ప్రజలు అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి దోహదపడాలని పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి కోరారు. మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన ఆస్తి, నీటి పన్ను వసూలుకార్యక్రమంలో పాల్గొన్నారు. వందశాతం పన్నులు వసూలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

దర్జీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని స్థానిక దర్జీలు (టైలర్లు) కోరారు. అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా మంగళవారం వారు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టైలర్ మాస్టర్స్, టైలర్స్ పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : దర్జీల సాధక బాధలను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి తెలిపారు. మంగళవారం పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న ఉమంతి టైలర్ షాప్‌లో టైలర్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్జీల పరిస్థితిని గుర్తించి ముఖ్యమంత్రి ఏటా పది వేల రూపాయల ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత కంటి మెగా వైద్య శిబిరం

ముద్దనూరు : స్థానిక కడప రోడ్డులోని వైష్ణవి ఫిల్లింగ్ స్టేషన్ వద్ద గురువారం ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ముద్దనూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బెంగళూరులోని శంకర్ నేత్రాలయ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని అదే రోజు ప్రత్యేక బస్సులో బెంగళూరుకు తరలించి ఉచితంగా చేస్తారని, కంటి అద్దాలు, మందులు ఇస్తారన్నారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తవ్వా వెంకటయ్యకు సన్మానం

ఖాజీపేట : అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యునిగా నియమించబడిన మండలంలోని తవ్వారిపల్లె గ్రామానికి చెందిన తవ్వా వెంకటయ్యను ఆ గ్రామ పెద్దలు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆంజనేయ స్వామి ఆల యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానించి. అభినందించారు. టిడిపి మండలశాఖ అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, రవీంద్రారెడ్డి, పెద్దబ్బి పాల్గొన్నారు.

తవ్వా వెంకటయ్యను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

ఆదర్శప్రాయులు సర్ సివి రామన్ : డిఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

తన పరి శోధనలతో భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన శాస్త్రవేత్త సర్ సివి రామన్ సేవలు నేటి తరానికి ఆదర్శమని డిఇఒ దేవరాజ్ అన్నారు. మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాలలో ప్రదర్శనలు నిర్వహించారు. భారతరత్న, నోబెల్ బహుమతి గ్రహిత సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. భౌతికశాస్త్రంలో వారు చేసిన పరిశోధనలు, సేవలు గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌విఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, శ్రీ సాయి భారతి పాఠశాల కరస్పాండెంట్ రామతులసి, ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు సురేష్, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** సర్ సివి రామన్ జయంతి సందర్భంగా మంగళవారం పలు పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న విజ్ఞాన పాఠాలను నమూనాల ద్వారా వ్యక్తపరచడం సంతోషంగా ఉందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. గౌతమ్ ఇంగ్లీష్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్స్ మురళీకృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి ప్రతిభ ఒకరి సొత్తు కాదనేలా సైన్స్‌కు సంబంధించిన అనేక ప్రయోగాలను చేసి నిరూపించడంతో రామన్‌కు నిజమైన నివాళి అర్పిస్తున్నామన్నారు. విశ్వజ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ మారెడ్డి మాటాడుతూ పర్యావరణంపై ప్రభావం చూపే వాటిని నమూనాలతో చూపించడం విద్యార్థుల నైపుణ్యానికి నిదర్శనమన్నారు. జాన్స్ హైస్కూల్, సెయింట్ మేరీస్, చల్లపల్లి, పద్మావతి, శ్రీ పూజిత ఇంగ్లీష్ మీడియం, గీతాంజలి, రేడియన్స్, టి.కే.ఆర్ జీవన జ్యోతి హైస్కూల్, స్లేట్ ప్లే స్కూల్, భారతి విద్యా మందిరం, సరస్వతి విద్యామందిరం, రాఘవేంద్ర పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలలో సం సి.వి రామన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్ సివి రామన్ జయంతిని స్థానిక టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జెవివి పట్టణ కార్యదర్శి రాఘవేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు, మహేష్ నాయుడు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు గురుశేఖర్ ఘనంగా నిర్వహించారు. **వేంపల్లె :** మానవాళి మనుగడకు సైన్సు ఎంతో అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాం జనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్సు ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు ఓబుల్‌రెడ్డి, సునీత, కళ్యాణి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బాలబయన్న అధ్య క్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎ అస్టింటెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఇష్టంగా చదివి ఒక ఉపాధ్యాయులు, శాస్త్ర వేత్తలు, డాక్టర్లు, ఇంజినీర్లుగా మంచి స్థాయిలో ఉండవచ్చన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ 1986లో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ ఫిబ్రవరి, 28న జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటించాలని భారత ప్రభుత్వాన్ని కోరిందన్నారు. ఎంఇఒ నారాయణ మాట్లాడుతూ పిల్లలు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, బాగా చదవాలని చెప్పారు. విద్యానికేతన్ పాఠశాలలో చిట్టి చిట్టి ప్రయోగాలు, మెజీషియన్ బాలబయన్న, వెంకటేశ్వర్లు మేజిక్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షులు సునీత, మధుసూదన్, రాయల్ కరిముల్ల, కామేశ్వరమ్మ, సత్యనారాయణ, శ్రీనివాసరాజు, సువర్ణలత, చంద్రకళ పాల్గొన్నారు. **ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో..** చిన్నచౌక్‌లో ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వారి ప్రతిభను బయటకు తీసుకు రావడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులు 200 వైజ్ఞానిక ప్రయోగాలను ప్రదర్శించారని చెప్పారు. ముఖ్యఅతిథిగా అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌ఛార్జి సందీప్ వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో శివకుమార్, సంధ్య రెడ్డి, ఓబుల్ రెడ్డి, జయ చంద్ర, లక్ష్మయ్య పాల్గొన్నారు. **జిల్లా యువజన సర్వీసుల శాఖ స్టెప్ ఆధ్వర్యంలో...** మంగళవారం స్థానిక మున్సిపల్ హై స్కూల్ మెయిన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విజేతలకు స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, స్కూల్ హెడ్మాస్టర్ నాగమణి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అబ్దుల్ సత్తార్, రామ మోహన్, వరప్రసాద్, దామోదర్, స్కూల్ విద్యార్థులు, స్టెప్ సిబ్బంది అబ్బాసు, సుబ్బారావు, నాగయ్య పాల్గొన్నారు. **పీస్ స్కూల్‌లో..** మరియాపురం ఎస్‌బిఐ కాలనీలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జాతీయ సైన్స్ డే ను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు తమ ప్రాజెక్ట్ నమూనాలు, ఫుడ్ ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. విద్యార్థులు తీసుకువచ్చిన నమూనాలను పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్, కార్పొరేటర్ బాల స్వామి రెడ్డి సందర్శించారు. **గురుకుల్ విద్యాపీఠ్‌లో..** నగరంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎవిఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు, సిఇఒ వివేకానంద సైన్స్ దినోత్సవాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీరకుమారి, పల్లవి, ప్రధానోపాధ్యాయులు ముని చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, ఎస్ఎస్ఎస్ విభాగాధిపతి శశి కుమార్ పాల్గొని మాట్లాడారు. **చాపాడు :** స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సర్ సివి రామన్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి ప్రతి ప్రాజెక్టును దగ్గరుండి పరిశీలించారు. వారి తెలివితేటలను పరీక్షించారు. విద్యార్థుల సమాధానాల పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాధా ఎంకె నాయర్ పాల్గొన్నారు. **వేంపల్లె :** సమాజంలో గుర్తింపు పొందాలంటే విద్యార్థులు ప్రాథమిక దశ నుండే క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా సైన్స్‌ఫేర్, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముందుగా శాస్త్రవేత్త సివి రామన్ చిత్ర పటానికి నివాళులర్పించి, వైజ్ఞానిక ప్రదర్శనను మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం తులసిరెడ్డి, మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి, కందుల విద్యా సంస్థల చైర్మన్ కందుల ఓబుల్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సరోజినీ నమూనాలను పరిశీలించి, వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ కరస్పాండెంట్ నారాయణరెడ్డి, ఎంఇఒ వీరారెడ్డి, పూలా శ్రీనివాసులురెడ్డి, స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయురెడ్డి, గండి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి పాల్గొన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు.

ఒంటిమిట్ట : బహుమతులు పొందిన విద్యార్థులతో డిఇఒ

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE : KADAPA.
I.A.No. 603/2021
O.S.No. 820/2021

Paladi Venkata Subbaiah Setty @ Paladi Venkata Subbaiah, S/o Pullaiah Setty, retd. Government servant, aged about 65 years, Hindu, resident of Flat No. 302, Keerthi Enclave, Balaji Nagar, Kadapa City and District. **...Petitioner/ Plaintiff**

Vs

2. Borra Sambasiva Reddy, S/o Obul Reddy, Hindu, aged 54 years, Agriculture, resident of D.No. 1/29, Mittamanupalle Village, Mydukur Mandal, Kadapa District.

...Respondent No.2/ Defendant No.2

NOTICE TO RESPONDENT NO.2

పై పిటిషన్‌లోని పిటిషనర్ మీ పైన మరియు ఇంకొంత మంది పైన పై Petition Schedule Property విషయమై Temporary Injuction కోరుచూ పై కోర్టులో పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటిషన్‌లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 24.03.2023న ఉన్నది. కావున మీరు ఆ దినము అనగా 24.03.2023న ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు వున్నయెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//
P.RAJENDRA PRASAD
Advocate For Petitioner

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE : KADAPA.
O.S.No. 820/2021

Paladi Venkata Subbaiah Setty @ Paladi Venkata Subbaiah, S/o Pullaiah Setty, retd. Government servant, aged about 65 years, Hindu, resident of Flat No. 302, Keerthi Enclave, Balaji Nagar, Kadapa City and District. **...Plaintiff**

Vs

2. Borra Sambasiva Reddy, S/o Obul Reddy, Hindu, aged 54 years, Agriculture, resident of D.No. 1/29, Mittamanupalle Village, Mydukur Mandal, Kadapa District. **...Defendant No.2**

SUMMONS TO DEFENDANT NO.2

పై దావాలోని వాది మీ పైన మరియు ఇంకొంత మంది పైన పై దావా షెడ్యూలు దాఖల ఆస్థి విషయమై Declaration మరియు Permanent Injuction కోరుచూ పై కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తమై వాయిదా 24.03.2023న ఉన్నది. కావున మీరు ఆ దినము అనగా 24.03.2023న ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//
P.RAJENDRA PRASAD
Advocate For Plaintiff

IN THE COURT OF THE HONORABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA
O.S.No. 878/2021

V.Vasantha, W/o Nagabhushanam, Hindu, aged about 52 years, Hotel business, residing at D.No.1/339, Maruthi Nagar, Kadapa City and District. **...Plaintiff**

Vs

P.Sher Khan, S/o P.Mahaboob Khan, Muslim, aged about 45 years, residing at D.No.4/280-1, Nagarajupet, Kadapa City and District. **...Defendant**

నోటీసు

పై దావాను వాది మీ మీద దాఖలు చేసియున్నారు. పై దావా నందు రాజశ్రీ కోర్టు వారి ఆదేశం మేరకు మీరు హాజరగుటకు, మీ ఆక్షేపణలు తెలియజేయుటకు 14-3-2023వ తేదీన వాయిదా యుంటూయున్నది. కావున మీరు స్వయముగా కాని, వకీలు ద్వారా కాని 14-3-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని ఎడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order of The Court//
T.MOHAN KRISHNA
D.ARAVINDH
Advocates,
KADAPA.

IN THE COURT OF THE HONORABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA
I.A.No. 467/2021
O.S.No. 878/2021

V.Vasantha, W/o Nagabhushanam, Hindu, aged about 52 years, Hotel business, residing at D.No.1/339, Maruthi Nagar, Kadapa City and District. **...Petitioner/Plaintiff**

Vs

P.Sher Khan, S/o P.Mahaboob Khan, Muslim, aged about 45 years, residing at D.No.4/280-1, Nagarajupet, Kadapa City and District. **...Respondent/Defendant**

నోటీసు

పై దావాలోని ఐ.ఎ.నెం.467/2021నందు రాజశ్రీ కోర్టు వారి ఆదేశాల మేరకు మీరు హాజరగుటకు, ఆక్షేపణలు తెలియజేయుటకు 14-3-2023వ తేదీన వాయిదా యుంటూయున్నది. కావున మీరు 14-3-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయముగా కాని, వకీలు ద్వారా కానీ మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order of The Court//
T.MOHAN KRISHNA
D.ARAVINDH
Advocates,
KADAPA.